

సర్పంచ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనంతగిరి:అనారోగ్యంతో మృతి చెందిన ఆశ కార్యకర్త కుటుంబానికి కొత్తూరు సర్పంచ్ సారా సీతయ్య ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తూరు పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన చింత నీలమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి 8.వేల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు సన్యాసమ్మ, నూకమ్మ, పైడితల్లి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్. సీతయ్య

సిపిఎం ఉక్కు సంకల్పం

-నేడు అల్లూరి జిల్లా అనంతగిరికి రానున్న బైక్ ర్యాలీ
-జిల్లాలో రెండు రోజుల పాటు సాగనున్న జాతా
-ఉక్కు ప్రైవేటీకరణతో గిరిజనులకు నష్టం

ప్రజాశక్తి-పాడేరుటౌన్, పాడేరు: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో తెలుగువారి ఉద్యమ ఫలితంగా ఏర్పడింది. తెలుగు ప్రజలు పోరాడి 32 మంది ప్రాణ త్యాగాలతో, 16 వేల మంది రైతుల త్యాగఫలంగా స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నారు. అప్పటి నుంచి దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ నాణ్యమైన ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది. అలాంటి సంస్థను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అమ్మేయాలని మోడీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఉక్కు కర్మాగారం ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రధాన ప్రభుత్వ రంగ యూనిట్. దాని ప్రైవేటీకరణ రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్రమైన హానిని తలపెట్టడమే. దీనిని కాపాడుకోవడానికి ఉద్యోగులు, కార్మికులు దీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారు. అయినా మోడీ ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల ఉద్యమాన్ని కనీసం పట్టించుకోలేదు. ప్రైవేటు పరం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యానికి అడ్డంకులను సృష్టిస్తూ పరిశ్రమకు నష్టాలు కలిగేలా వ్యవహరిస్తోంది. ఇదే జరిగితే అందులో పని చేస్తున్న సుమారు 3,500 మంది ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోల్పోతారు. భవిష్యత్తులోనూ గిరిజన ప్రాంతాల నుంచి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఉండవు. ఉక్కు ప్రైవేటీకరణ జరిగితే గిరిజన యువత ఉద్యోగ రిజర్వేషన్ కోల్పోతామని ఆవేదన చెందుతున్నారు. అలాగే స్టీల్ ప్లాంట్ లో జిల్లాకు చెందిన వందలాది మంది పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్ ను కాపాడుకోవడం రాష్ట్ర ప్రజల బాధ్యత.

సిపిఎం బైక్ యాత్ర

విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించుకునేందుకు సిపిఎం చేస్తున్న పోరాటాల్లో భాగంగా విశాఖలో ఈనెల 20న ప్రారంభమైన బైక్ యాత్ర 25న సోమవారం అల్లూరి జిల్లా అనంతగిరి మండలానికి చేరుకోనుంది. మండలంలోని కాశీపట్నంలో ఉదయం 11:30 గంటలకు చేరుకుంటుంది. అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:30 గంటలకు అరకు వేలి చేరుకోనుంది. అది మధ్యాహ్నం భోజనం అనంతరం ఐటిఐ డిగ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులతో నాయకులు మాట్లాడుతారు. అక్కడ నుంచి డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల మీదుగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు 4:30 గంటలకు చేరుకుంటుంది. పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో మాట్లాడతారు. రాత్రి పాడేరులో బస చేయనున్నారు. 26వ తేదీ ఉదయం జి.మాడుగుల మండల కేంద్రంలో అల్పాహారం తీసుకుంటారు. ఉదయం 10 గంటలకు చింతపల్లి మండలంలో చేరుకుంటారు. అక్కడ నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడ నుంచి సాయంత్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చేరుకోనున్నారు. బైక్ ర్యాలీలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అయిన నేపథ్యం, ఉత్తరాంధ్ర ఆర్థిక అభివృద్ధిలో అవసరం, ప్రైవేటికరణకు కేంద్ర అనుసరిస్తున్న దుర్మార్గ విధానాలు, రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు, యువతకు వివరించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడు తుండటంతో విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలోనూ ర్యాలీ సాగనుంది.



బైక్ జాతా చేపడుతున్న నేతలు (ఫైల్)

రాష్ట్ర ప్రజలకు మోడీ వెన్నుపోటు

బిజెపి ప్రభుత్వం చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. వాగ్దానాలను అమలు జరపకపోగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తెగనమ్మడానికి మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం ఇంతకన్నా దుర్మార్గం ఇంకోటి లేదు. విశాఖలో 2014లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఎపికు ప్రత్యేక హెూదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని మోడీ హామీ ఇచ్చారు. వాగ్దానాలు చేసి ఇప్పటికీ 8 ఏళ్లు పూర్తయిన ఆచరణలో అతీ గతీ లేదు.



పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

రాష్ట్ర ప్రజలు ప్రభుత్వ రంగాలను కాపాడాలని మొత్తుకుంటుంటే కనీసం పట్టించుకోకుండా ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. విశాఖ ఉక్కు కార్మికులు, నగర ప్రజలు, వివిధ సంఘాల జెఎసి, బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తున్నాయి. ట్రేడ్ యూనియన్లు ఐక్యంగా పోరాడుతున్నాయి. అయినా మోడీ వీటినేమీ లెక్క చేయకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు తీవ్రంగా దెబ్బకొడుతూ ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారు.



గంగరాజు,
అనంతగిరి జెడ్‌పిటిసి,
సిపిఎం

జూనియర్ కళాశాల స్థలాలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయ నియోజక వర్గం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన స్థలాలను పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ సహాయ కార్యదర్శి పి రామన్న డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురి అవుతున్న జూనియర్ కళాశాల స్థలాలను ఆదివారం ఎస్ఎఫ్ఐ బృందంతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ పరిధి అరకులోయలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గతంలో ప్రభుత్వం 8ఎకరాలు 50 సెంట్లు భూములు కేటాయించిందని తెలిపారు. ఈ భూములకు రక్షణ లేక పోవడంతో రాను రాను ఆక్రమణకు గురవుతుందని ఆయన అన్నారు. ఆక్రమణలను అరికట్టడంలో రెవెన్యూ, పంచాయతీ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. కళాశాల స్థలం కబ్జాకు గురి అవుతుందని ఎస్ఎఫ్ఐ గతంలో పోరాటాలు చేయడంతో ఫలితంగా నాడు నేడు ద్వారా ఇటీవల రూ. 1 కోటి 30 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు అయిందన్నారు. ఈ నిధులతో కళాశాల భవనాల నిర్మాణం, పాత భవనాలు మరమ్మత్తులు, మంచినీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ నిర్మాణం వంటి పనులు చేయవలసి ఉండగా, కళాశాల చుట్టూ ప్రహరీ గోడల పిల్లర్స్ వేసి పన్నులు ఆపివేయడంతో పరిస్థితి మొదటికి వచ్చిందన్నారు. పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఐసు బాబు, కమిటీ సభ్యులు పి రాజు, జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ నాయకులు బి సంపత్, టి.మనోహర్, ఎస్. చరణ్ కళాశాల విద్యార్థులు ఎస్ నాగేష్, సాయి కృష్ణ, జె.సందీప్, టి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

విహెచ్‌సిల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు

ఇంటింటా సర్వే - వ్యాధిగ్రస్తుల గుర్తింపు
'ప్రజాశక్తి'తో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా

ప్రజాశక్తి-పాడేరు:**అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం డివిజన్లోని 22 మండలాల్లో ఉన్న 297 విలేజ్ హెల్త్ క్లినిక్ (విహెచ్ సి)లలో ఈ నెల 30 నుంచి ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా వెల్లడించారు. ఈ బృహత్తర వైద్య ఆరోగ్య కార్యక్రమం 45 రోజులపాటు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే....**

మెడికల్ క్యాంపుల వివరాలు

జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో నిర్వహిస్తున్న ఈ మెడికల్ క్యాంపులకు ప్రత్యేక వైద్య నిపుణులను నియమించేందుకు చర్యలు తీసుకున్నాం. విశాఖపట్నం, ఈస్ట్‌గోదావరి జిల్లాల నుంచి సుమారు 100 మంది వైద్య నిపుణులు పాడేరు, రంపచోడవరం డివిజన్లో జరిగే వైద్య శిబిరాలలో పాల్గొని వైద్య చికిత్సలు అందిస్తారు. అన్ని రకాల వైద్య నిపుణులను అందుబాటులో ఉంచి ఈ మెడికల్ క్యాంపులలో వైద్య సేవలు అందిస్తారు. మండల స్థాయిలో వైద్య బృందాలను ఏర్పాటు చేస్తాం





ఇంటింటికి వైద్య బృందాల సర్వే

జిల్లావ్యాప్తంగా ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు పారామెడికల్ వైద్య బృందాలతో ఇంటింటికి సర్వే నిర్వహిస్తున్నాం. అనారోగ్యంతో ఉండే రోగులకు బిపి, షుగర్, రక్తహీనత ఇతర ఏడు రకాల ఆరోగ్య పరీక్షలను నిర్వహించి వ్యాధులను నిర్ధారిస్తున్నాం. ఈ నివేదికల ఆధారంగా విలేజ్ హెల్త్ క్లినిక్ ల పరిధి లో జరిగే మెడికల్ క్యాంపులలో వైద్య నిపుణుల ద్వారా చికిత్సలు అందిస్తాం.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యం

ప్రస్తుతం అన్ని మండలాల్లో జరుగుతున్న హెల్త్ సర్వే ద్వారా గుర్తించే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గుండె. కిడ్నీ, స్త్రీల వ్యాధులకు సంబంధించి అవసరమైన అన్ని రకాల శస్త్ర చికిత్సలు వైద్య సేవల కల్పనకు అవసరమైన ఆసుపత్రులకు రిఫరల్ చేస్తాం. సిటి స్కాన్ ఎంఆర్ఐ స్కాన్ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రతి కుటుంబానికి వైద్య సేవలు

జిల్లాలోని పాడేరు డివిజన్లో 2137, రంపచోడవరం డివిజన్లోని 553, చింతూరు డివిజన్లోని 282, చొప్పున మొత్తం 2 వేల 972 గ్రామాలలో పదిలక్షల అరవై మూడు వేల 158 మంది జనాభా లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందించడం కోసం రూపొందించిన ఈ బృహత్తర ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు పలు కార్యక్రమాలు ప్రవేశ పెడతుంది. అవసరమైన వైద్య చికిత్సలు పొందాలని ప్రజలను కోరుతున్నాం.

ఐద్వా 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మావతి

ప్రజాశక్తి-చింతూరు : మహిళలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటూ, వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వచ్చేనెల 5న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద చేపట్టే బహిరంగసభను,చలో ఢిల్లీ ఆందోళనను జయప్రదంచేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మావతి పిలుపునిచ్చారు. ఆదివారం కుంజా రాధ అధ్యక్షతన చింతూరులో జరిగిన ఐద్వా రంపచోడవరం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్లు పూర్తయినా, నేటికీ మహిళలు, బాలికలపై వేధింపులు, అత్యాచారాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాల దెబ్బకు మహిళలకు రక్షణ, భద్రత కరువైందని, ఈ నేపథ్యంలో ఐద్వా ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్త పోరుయాత్ర నిర్వహించామన్నారు. మహిళలకు సమానత్వం ప్రకటనల్లోనే తప్ప, ఆచరణలో అమలు జరగడం లేదన్నారు. చంద్రయాన్ -3 విజయవంతంలో 55 మంది మహిళా శాస్త్రవేత్తలు కీలకభూమిక పోషించిన నేటి రోజుల్లోనూ, మణిపూర్ ఆదివాసి గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారానికి పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. మహిళల విద్య, వైద్యం, ఉపాధికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. నారీ ద్రోహి మోడీని, కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే వారిని ఎదిరించాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల 5న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బహిరంగ సభకు పెద్దఎత్తున మహిళలు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రంగమ్మ , సున్నం పార్వతి, సుధారాణి, భద్రమ్మ, ధారమ్మ పాల్గొన్నారు.

150 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి, రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, 150మందికి వైద్యసేవలు అందించినటు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. డాక్టర్ జి భాస్కర్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ డాక్టర్ టివి.సుబ్బారావు పాల్గొని 150 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 62మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి మందికి ఎక్స్‌రేలు, ముగ్గురికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజి తెలిపినారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ గాధిరాజు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు, రోగులు, సహాయకులకు ఉచిత భోజనం అందించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మఠం మేనేజర్ స్వామీ రఘువీరనంద మహరాజ్, రాహుల్ మహారాజ్ తెలిపారు.

కాలువ గట్టు పరిశీలన

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలంలోని ముసురుమిల్లి ప్రాజెక్ట్ నుంచి తామరపల్లి మీదుగా వచ్చే కెనల్ బోదిని ముసురుమిల్లి ఎంపిటిసి వంశీ కుంజం ఆదివారం పరిశీలించారు. గట్టుకు మించి బోదె నిర్మాణం చేస్తుండడం వల్ల దిగువనున్న పంటపొలాలకు నష్టం వాటిల్లుతుందని గ్రామస్తులు ఆయన దృష్టికి తేగా, ఈ మేరకు పరిశీలన జరిపారు.దీనిపై ఎంపిపి, జెడ్‌పిటిసి దృష్టికి తీసుకెళ్లి, వారి ద్వారా ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. గృహసారధి చిరంజీవి, వేమన, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచం పట్టిన మన్యం!

- విజృంభిస్తున్న మలేరియా, డెంగీ, టైఫాయిడ్
- జ్వర పీడితులతో కిక్కిరిసిన ప్రభుత్వ ఆసుపత్రి
- విలవిల్లాడుతున్న ఏజెన్సీగిరిజనం
- సరిపడా బెడ్‌లు లేక రోగుల ఇక్కట్లు




చింతూరు సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ప్రజాశక్తి- చింతూరు : అల్లూరి జిల్లా చింతూరు డివిజన్ పరిధిలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో జనాలు అవస్థలు పడుతున్నారు. జ్వరపీడితులతోప్రభుత్వాసుపత్రి కిక్కిరిసి పోయింది. బెడ్‌లు లేక అవస్థలు పడే పరిస్థితి ఉంది.

నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు, వరదలకు ఏజెన్సీ ప్రాంతం చిత్తడి కావడంతో దోమలు బాగా వృద్ధి చెంది జ్వరాలకు విజృంభిస్తున్నాయి. చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ నమోదౌతున్న 200 నుంచి 300 వరకు ఒపియే ఇందుకు నిదర్శనం. ఆసుపత్రిలో చేరుతున్న రోగులకు ఉన్న 70 పడకలు ఎటూ సరిపడపోవడంతో వరండాలోనూ, ఆరుబయట రోగులకు వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్నా, వైద్యానికి వచ్చే రోగులకుసరిపడా బెడ్‌లు లేక ఇబ్బందులకు గురౌవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఒకటవ తేదీ 22వ తేదీ శుక్రవారం వరకు 37మంది డెంగీ లక్షణాలతో ఆసుపత్రిలో చేరగా, వారికి వైద్యపరీక్షల అనంతరం పదిమందికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. 1940 జ్వరపీడితులకు రక్తపరీక్షలు నిర్వహించగా, 107 మలేరియా పాజిటివ్‌లువచ్చాయి. ఇంకా మరో 503మంది టైఫాయిర్ పరీక్షలు నిర్వహించగా, 134 పాజిటివ్ వచ్చాయి. వైరల్ జ్వరాలతో బాధపడుతున్న 1708మంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

అపరిశుభ్రత, కలుషిత నీరే కారణం

చింతూరు డివిజన్‌లోని మారుమూల గ్రామాల్లో పేరుకుపోయిన అపరిశుభ్రత, కలుషిత తాగునీరు, దోమకాటు, వరదలే ప్రస్తుతం ఈ ప్రాంతంలో జ్వరాలు ప్రబలడానికి కారణమని అంటున్నారు.. వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టినా, అపరిశుభ్రత తాండవిస్తోంది. మండల కేంద్రంలోనే పారిశుధ్యం క్షీణించి, దోమలు విజృంభిస్తున్నా వాటి నివారణకు దోమల మందు పిచికారీగానీ, బావుల్లో క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టడం లేదంటే, ఇక మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే ఊహించుకోవచ్చని మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు. రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకులను కూడా శుభ్రం చేసే పరిస్థితి లేదు. ఇక డ్రైనేజీలు ఎక్కడికక్కడే పూడుకుకపోవడం, చెత్త, ఇతర వ్యర్థాలు ఎక్కడికక్కడే కుళ్లిపోయి దోమలకు ఆవాసంగా మారడంతో విషజ్వరాలు విలయతాండవం చేసే పరిస్థితి నెలకుంటోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం తాగునీరుపై దృష్టి సారించాలని చింతూరు డివిజన్ ప్రజలు కోరుతున్నారు. అలాగే చింతూరు ప్రాంతంలో ప్రబలుతున్న జ్వరాలకు అనుగుణంగా అవసరమైన పూర్తిస్థాయి మందులను అందుబాటులోకి తెచ్చి వైద్యసేవలు మెరుగుపరచడంతోపాటు మరింత విస్తృతం చేయాలని గిరిజనం కోరుతున్నారు.



జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు

సిహెచ్‌సి సూపరెంటిండెంట్ వివరణ

దీనిపై చింతూరు సిహెచ్‌సి సూపరెంటిఁడెంట్ డాక్టర్ కోటిరెడ్డి వివరణ కోరగా, ఆసుపత్రిలో 70 పడకలు మాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం వస్తున్న జ్వరపీడితుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరే వారికి అవి సరిపోవడం లేదన్నారు ప్రస్తుతం అన్ని రకాల జ్వరాలకు అవసరమైన వ్యాధినిర్ధారణ పరీక్షల సామగ్రి, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైసిపి పాలనలో గ్రామాభివృద్ధి గాలికి..

ప్రజాశక్తి- కూనవరం : వైసిపి పాలనలో గ్రామాభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని సిపిఎం జిల్లా నేత మేకల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని రేపాక గ్రామంలో మడకం బొజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ, రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి, ఆదాయసృష్టి కార్యక్రమాలను చేపట్టడం లేదన్నారు. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లకు రావాల్సిన నిధులను ముఖ్యంగా కేంద్రప్రభుత్వం కేటాయించిన నిధులను దారి మళ్లించి అభివృద్ధిని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంతాలలో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, ఇతరత్రా మౌలిక వసతులు కల్పన, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో పాయం సీతారామయ్య, స్థానిక సర్పంచ్ మడకం నాగమణి, పాయం జ్యోతి, జోగయ్య, బాబు బొర్రయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అంగన్వాడీ నేత గృహ నిర్బంధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: తమ సమస్య పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 25న చలో విజయవాడ ఆందోళనకు వెళ్లకుండా, యూనియన్ మండల కార్యదర్శి కె వెంకటలక్ష్మిని ఆదివారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి, నోటీసులు జారీ చేశారు. ఎటువంటి సమావేశాలు, ధర్నాలకు వెళ్లరాదని, పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆంక్షలు విధించారు.



వెంకటలక్ష్మికి నోటీసు ఇస్తున్న పోలీసులు

12వ రోజుకు టిడిపి రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -రంపచోడవరం : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారం 12వ రోజుకు చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్ పూలదండలు వేసి దీక్షను ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లిన జగన్‌రెడ్డి, నేడు నీతులు వల్లించడం శోచనీయమన్నారు. రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టించారన్నారు. లక్షలకోట్ల అవినీతితో అనేక కేసుల్లో నిందితునిగా ఉన్న జగన్‌రెడ్డి, పదేళ్లు బెయిల్ బయట తిరుగుతూ, నిజాయితీ, నిస్వార్ధ ప్రజానాయకుడైన చంద్రబాబుకు అవినీతి మరక అంటించి, జైల్లో పెట్టించి శునకానందం పొందుతున్నారన్నారు.

ఒకదాని వెంట మరొకటిగా కేసులు పెట్టిస్తూ, చంద్రబాబును రాజకీయంగా వేధింపులకు గురిచేస్తున్న సిఎం జగన్, తన పతనానికి తానే గోతిని తవ్వుకుంటున్న విషయాన్ని విస్మరించడం శోచనీయమన్నారు. చంద్రబాబు అరెస్ట్‌తో అతిఘోర తప్పిదం చేసిన జగన్, తన రాజకీయ జీవితానికి తానే సమాధి కట్టుకున్నాడన్న విషయం అతిత్వరలో తెలుస్తుందన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులకు సహకరించిన అధికారులు, నేతలు ప్రతిఒక్కరికీ రెట్టింపు దండన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు, మరి చెట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు పెంటపాటి అనంతమోహన్, మట్ట మెహర్‌బాబా గౌడ్, రాష్ట్ర నాయకులు జెఎస్.నగేష్, సుభాన్, గొర్లె సునీత, మగాపు బాబూరావు, ముచ్చు నాగేశ్వరరావు, మండల నాయకులు అడబాల బాపిరాజు, వై నిరంజనీ దేవి,కారం సింహాచలం, కుంజం బాపన్న దొర, తీగల ప్రభ ,తైలం గంగాధర్ రావు, ముచ్చు త్రిమూర్తులు, పండా బాబీ, కొమరం బాబీ, సిద్దా వెంకన్న, వైఎస్.బోస్, నీలపు సురేష్, మడకం పండు దొర, సాధల సత్యవతి, సంకూర్ పెంటమ్మ, కోసు నాగన్న దొర పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ..ఆపై పని ఒత్తిడి

-సమస్యలతో అంగన్‌వాడీలు సతమతం
-నేడు విజయవాడలో ధర్నా
- అడుగడుగునా ప్రభుత్వం ఆంక్షలు
-గృహ నిర్బంధాలు చేస్తున్న పోలీసులు



అంగన్వాడీ కేంద్రం (ఫైల్)

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అధికారం చేపట్టడానికి ఎడాపెడా హామీలను గుర్తించిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఇచ్చిన హామీలను మర్చిపోయారని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకుల నుంచి మొదలు జిల్లా అధికారుల వరకు అందరు పెత్తనం అంగన్వాడీల మీదేనని, కాని వారి సమస్యలు ఎవరికి పట్టమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొడ్డు చాకిరీ చేయించుకోవడానికి అంగన్వాడీ వ్యవస్థను వినియోగించుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు. ఎన్ని దీక్షలు, నిరసనలు చేసినా స్పందనలేదని, ఒక్క హామీని కూడా ప్రభుత్వం తీర్చలేదంటూ వాపోతున్నారు. జిల్లాల విభజన తర్వాత అల్లూరి జిల్లా వ్యాప్తంగా 3,200 మంది విధుల్లో ఉన్నారు. 2019లో జగన్ హామీ ఇచ్చినప్పుడు తెలంగాణలో అంగన్వాడీలకు రూ.10 వేలు జీతముండగా ఇటీవల మారో రూ.4500 పెంచి రూ.14,500 ఇస్తున్నారు. జగన్ హామీ ప్రకారం ఏపిలో రూ.15,500 జీతం తీసుకోవాల్సి ఉండగా కేవలం రూ.11 వేలు మాత్రమే అంగన్వాడీలకు అందిస్తున్నారు. హామీలను నమ్మి పూర్తిగా మోసపోయామని అంగన్వాడీలు చెబుతున్నారు. గడచిన నాలుగేళ్లుగా టిఎ, డిఎలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా, నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతోందని కన్నీరు మున్నీరవుతున్నారు. ఆటపాటలతో ప్రీస్కూల్ విద్య నేర్పరమే అంగన్వాడీ వ్యవస్థ ముఖ్య లక్ష్యం. అయితే లక్ష్యం పక్కదారి పడుతోందని, అంగన్వాడి టీచర్లపై పని ఒత్తిడి పెరిగిందని వాపోతున్నారు. 3 రకాల యాప్ ల నిర్వహణ భారం, ఈ క్రమంలో సర్వర్ సమస్యలతో కాలం గడిచిపోగా పిల్లలతో మమేకమయ్యే అవకాశం లేకుండా పోతోంది. పైగా వారానికి రెండుసార్లు మహిళా పోలీస్ లు అంగన్వాడి సెంటర్ల విసిట్లు తలనొప్పిగా మారింది. మహిళ పోలీసుల పెత్తనం ఎక్కువైందని పలువురు కార్యకర్తలు వాపోతున్నారు. గతంలో హాజరు మాత్రమే ఆన్ లైన్ ద్వారా చేసే వారిని ప్రస్తుతం పని ఒత్తిడి పెరిగిందని చెబుతున్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 25న విజవాయడలో తలపెట్టిన ధర్నాను విఫలం చేయడానికి ప్రభుత్వం పోలీసులతో నిర్బంధాలకు, అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమని అంగన్‌వాడీ యూనియన్ నేతలు వాపోయారు.

ఇవీ డిమాండ్స్..

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలిరాజకీయ వేధింపులు ఆపాలి, కార్యకర్తలు ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి, సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితిని తొలగించాలి. 300 జనాభా దాటిన మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలి. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. కూరలు, గ్యాస్ సిలిండర్, ఇతరత్రా అన్ని ఖర్చులు కలిపి పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఖచ్చితమైన మెనూ అమలుకు చార్జీలు పెంచాలి. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి. పెండింగ్ లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలి. యాప్ ల భారం తగ్గించి పని ఒత్తిడి తగ్గించాలి. కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలి. ముఖ అధారిత యాప్ రద్దు చేయాలి. కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి.

సమస్యలు పరిష్కరించాలి

కూరలు, గ్యాస్ సిలిండర్ ఇతర ఇతర అన్ని ఖర్చులు కలిపి పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పెరిగిన నిత్యావసర ధరలతో వారికి భోజనం ఎలా పెట్టాలి. ఖచ్చితమైన మెనూ పాటించడం సాధ్యమేనా? చార్జీలు పెంచాలి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి. ఇచ్చిన చరవాణులు సరిగా పనిచేయక పోగా, 3 రకాల యాప్ లతో రకరకాల పనులు చెబుతున్నారు. పని భారంతో ఇబ్బందులు పడుతున్నాం. తనిఖీల పేర్లతో కార్యకర్తలకు వేధింపులు ఆపాలి.



వి.భాగ్యలక్ష్మి
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిర్బంధం అమానుషం : అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు:- రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అంగన్వాడీ వర్కర్లపై పోలీసులు నిర్బంధాలు ప్రయోగించడం అమానుషమని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి ఈనెల 25 న తలపెట్టిన ధర్నాను విఫలం చేయడానికి ప్రభుత్వం, పోలీసులతో నిర్బంధాలకు అరెస్టులకు పాల్పడడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ధర్నాలో హింస జరుగుతుందనే తప్పుడు ప్రచారం పోలీసులు చేయడం గర్హనీయమన్నారు. అంగన్వాడీలను ఎక్కడికక్కడ ఇళ్ళవద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతినివ్వకపోవడం అప్రజాస్వామిక మైన చర్య అని అన్నారు. అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యల కోసం గత కొంతకాలంగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు జరిపారని అయినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణమని ఖండించారు. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే అవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న విజయవాడ ధర్నాకు అనుమతినివ్వాలన్నారు.

అడ్డుకోవడం తగదు: సిఐటియు

పాడేరు: అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 25న విజయవాడలో తలపెట్టిన మహా ధర్నాకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు చేత ఉద్యమాన్ని నిర్బంధించడం తగదని సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటనలు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు విడుదల చేశారు.అధికార రాకముందు సిఎం జగన్ పాదయాత్రలో అంగన్వాడీలకు మెరుగైన వేతనాలు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని అంతేకాకుండా తెలంగాణ కంటే అదనంగా వేతనం ఇస్తామని చెప్పి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా అమలు చేయలేదని తెలిపారు. హామీలు అమలు చేయమని రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు పెద్ద ఎత్తున శాంతియుతంగా నిరసన తెలుపు తుంటే మహిళలని చూడకుండా ఇళ్ల వద్దకు వెళ్లి అంగన్వాడి నాయకులను అర్ధరాత్రి పూట నిర్బంధించడం సమంజసం కాదని తెలిపారు



బాధితుడితో మాట్లాడుతున్న నాయకులు

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెదబయలు రూరల్: గిరిజనుడుపై దాడి పాల్పడిన సబ్ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ఆదికార. రాష్ట్రీయ మంచ్ సభ్యురాలు. తలాబు కౌసల్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిని. ధర్మాన పడల్ డిమాండ్ చేశారు. బాధితుడు స్వగ్రామమైన మొండికోట గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ, ఆదివాసి ప్రాంతంలో పోలీసులు తప్పు చేసినా చర్యలు తీసుకోకుండా ఏదైనా కొత్త చట్టం తెచ్చారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన జరిగి పది రోజులు అవుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోపోవడం చూస్తుంటే గిరిజన ప్రాంతాల్లో గిరిజన హక్కులు, చట్టాలు అమలు కాలేదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామానికి వెళ్లి నిజా నిజాలు తెలుసుకొని సక్రమంగా దర్యాప్తు జరిపి ఎస్సై పులి మనోజ్ కుమార్ పె చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుడిని బెదిరించిన జియో టవర్ గుత్తేదారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బోండా గంగాధరం, కిలో సర్బన్న పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సమిష్టి పోరాటం

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన ఉద్యోగ రిజర్వేషన్ జీవో 3 ని పునరుద్ధరించడం చాలా ఆవశ్యమని ఇందుకు గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలన్నీ సమిష్టిగా పోరాటం సాగించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. పలు డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని వారు ఆదివారం సందర్శించి తమ మద్దతు తెలిపారు. మూడో రోజు ఈ రిలే దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో 3 పునరుద్ధరణ కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ చెప్పారు. గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పలాసి కృష్ణారావు, ముఖి శేషాద్రి, గిడ్డి వరలక్ష్మి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తిప్పికొట్టాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వం చేసినది రాజకీయ నిర్ణయమని, దానిని రాజకీయంగానే తిప్పికొట్టాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ పూర్వ గౌరవాధ్యక్షులు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 955వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అధ్యక్షతన కార్మికులు కూర్చున్నారు. శిబిరాన్ని ఉద్దేశించి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, 955 రోజులుగా స్టీల్ కార్మికవర్గం చేస్తున్న పోరాటం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణకు ఒక్క అడుగు ముందుకు వేయకుండా అడ్డుకోగలిగామన్నారు. రాష్ట్ర ప్రజానీకం ద్వారా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలని, రాబోయే ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి చిత్తశుద్ధితో నిలబడిన వారికే భవిష్యత్తు అన్న విధంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. భారత్ బచావో సంస్థ ప్రతినిధులు శిబిరానికి వచ్చి పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఆప్ ప్రతినిధులు శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో టిపిపి కాంట్రాక్టు కార్మికులతోపాటు నాయకులు ఒవి.రావు, ఎ.శ్రీనివాస్, ఆర్‌టి.రాజు, బండి అప్పలరాజు పాల్గొన్నారు. పోరాటకమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్, నీరుకొండ రామచంద్రరావు, ఎ.వల్లీ పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలో తమ్మునిపై దాడి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల కేంద్రం లోని పద్మాపురం పంచాయతీ ఎండపల్లివలస గ్రామ నివాసి బాబూలాల్ పై అక్రమంగా తండ్రీ కొడుకులు కర్రలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు బాబూలాల్ ఆదివారం విలేకరుల ముందు వాపోయారు. బయినా దినేష్, ఇంద్ర కుమార్ ఇద్దరూ తండ్రి కొడుకులు కలిసి ఇంట్లో చొరబడి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చనట్లు తెలిపారు. దినేష్ టక్కర్, బాబూలాల్ (అన్నదమ్ములు) ఇద్దరు కలిసి వ్యాపారం చేసి సంపాదించిన ఆస్తులు పంపకంపై వివాదం నెలకొంది. ఈ క్రమంలో దాడి చేశారని బాధితుడు వాపోయాడు. పోలిసులు కేసు నమోదు చేశారన్నారు.

వాలంటీర్‌కు తీవ్ర అస్వస్థత

ఆదుకోవాలని కుటుంబీకుల వినతి

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలానికి చెందిన గోమంగీ సచివాలయంలో గ్రామ వాలంటీర్‌గా పని చేస్తున్న గడుతురి శ్రీనివాసరావు గత నెల రోజుల నుండి తీవ్ర అనారోగ్యం పాలై విశాఖ కె జిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కాళ్ళు, చేతులు కదపలేని స్థితిలో ఉన్నాడని తన భార్య అనిత, తల్లిదండ్రులు మన్మధరావు, సత్యమ్మ కుటుంబ సభ్యులు విలేకర్ల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుటుంబానికి పెద్ద దిక్కు శ్రీనివాసరావుపై ఆధారపడి జీవిస్తున్నామని, వాలంటీర్‌గా సంక్షేమ పథకాలను 50కుటుంబాలకు అందించడంలో ఎంతో కష్ట పడి పని చేశాడన్నారు. మెరుగైన వైద్యం కోసం సుమారు ఐదు లక్షలు అవుతుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి స్పందించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-పెదబయలు: విశాఖపట్నం మారికివలస గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ బాలుర పాఠశాలలో విద్యార్థి మృతికి కారకులైన ప్రిన్సిపాల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా అధ్యక్షులు జీవన కృష్ణ ఆదివారం డిమాండ్ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈనెల 21న చంద్రకిరణ్‌కు నోటి, ముక్కు నుండి రక్తం స్రావమైందని, ప్రిన్సిపాల్ తక్షణమే స్పందించకుండా మరుసటి రోజు కెజీ హెచ్‌లో చేర్చడంతో ఆ విద్యార్థి ఆరోగ్యం అప్పటికే విషమించిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచక పోవడమే కాకుండా తల్లిదండ్రులకు కనీస సమాచారం అందించలేదన్నారు. విద్యార్థి తల్లిదండ్రులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర కార్తీక్ పాల్గొన్నారు.



వడ్లపూడిలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ఉక్కు రక్షణకు బైకు ర్యాలీలు

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక (విశాఖపట్నం)

ఈ నెల 20 నుంచి సిపిఎం ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో సాగుతున్న విశాఖ ఉక్కు రక్షణ బైకు యాత్రకు మద్దతుగా గాజువాక నియోజకవర్గంలో ఆదివారం పలుచోట్ల బైకు ర్యాలీలు నిర్వహించారు. నిర్వాసిత కాలనీల్లో 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదం మార్మోగింది. పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉక్కునగరంలోని రైతు బజార్ నుంచి బైకు ర్యాలీ ప్రారంభమై అన్ని సెక్టార్లలో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ తమ కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర జీవనాడి అయిన విశాఖ ఉక్కు కర్మాగారంపై కుట్రలు పన్నుతున్నా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 29న ఉక్కునగరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు, సీనియర్ నాయకులు రామారావు, ఐద్వా నాయకులు వేణు, స్టీల్ డివిజన్ సిపిఎం, సిఐటియు నాయకులు టి.చిరంజీవి, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, పుల్లారావు, వి.ప్రసాద్, ఎస్‌కెకె.మొహిద్దిన్, కె.బాలశౌరి, కెపి.సుబ్రమణ్యం, బిఎన్.మధుసూదన్, కెవి.సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, శ్రీ రామచంద్రరావు, భానుమూర్తి పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో నిర్వహించిన బైకు ర్యాలీని నాయకులు కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. వడ్లపూడిలో జరిగిన బైకు ర్యాలీని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ ఆరంభించి మాట్లాడారు. ఐక్య పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు.

పెదగంట్యాడ పరిధిలో హౌసింగ్ బోర్డు సిడబ్ల్యుసి భవనం వద్ద బైకు ర్యాలీ ప్రారంభమై చిన కోరాడ, పెదకోరాడ, సీతానగరం, నడుపూరు, సిద్ధేశ్వరం, అయ్యన్నపాలెం, నెల్లిముక్కు ఏరియాల్లో సాగింది. సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.రామారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో పాల అప్పలరెడ్డి, కొండ శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి గురప్ప, కొవిరి అప్పలరాజు, సిహెచ్.రాముడు, అప్పారావు, శ్రీనివాసరెడ్డి, డి.వెంకటరావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులపై నిర్బంధం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. పెండింగ్ జీతాలు చెల్లించాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగుల జెఎసి సోమవారం విజయవాడలో సత్యాగ్రహ దీక్షకు పిలుపునిచ్చింది. ఆ దీక్షకు అనకాపల్లి జిల్లా నుంచి వెళ్తున్న ఉద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. చీడికాడ, గొలుగొండ మండలాల్లో శనివారం నుంచి గృహ నిర్బంధాలు చేశారు. కార్యాలయాలకు వెళ్లి ఫోన్లు తీసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు రావాలని ఒత్తిడి తెచ్చారు. జిల్లాలో 11 మండలాల్లో ఎస్ఎస్ఎ ఉద్యోగులను విజయవాడ వెళ్లకుండా పోలీసులు ఇళ్ల వద్ద అడ్డుకున్నారు. కొన్నిచోట్ల పోలీసు స్టేషన్‌కు రప్పించి నిర్బంధించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎస్ఎస్ఎ ఉద్యోగులను సత్యాగ్రహ దీక్షకు వెళ్లకుండా నిర్బంధించడం సరికాదు. గతంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయాలి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టాలి.

అవి దేవాలయ భూములే..!

నిషేధిత జాబితాలో సర్వే నెంబర్ 115, 118/4, 120
దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ
మారేపల్లి లే అవుట్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట - 'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని దేవరాపల్లి మండలం మారేపల్లి సర్వే నెంబరు 115, 118/4, 120లో 40.25 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెడుతూ దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. ఎస్ఎఫ్ఎ, 1బి, 10(1) రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 115లో 23.15 ఎకరాలు, సర్వే నెంబర్ 118/4లో 6.25 ఎకరాలు, సర్వే నెంబర్ 120లో 10.85 ఎకరాలు మారేపల్లి శ్రీ రామాలయం భూమిగా నమోదు కావడంతో ఆ భూములు రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిత జాబితాలో చేర్చారు.



దేవాలయ భూమిలోని లే అవుట్

సర్వే నెంబర్ 115లోని 23.15 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి లే అవుట్లు వేసి అమ్మినట్లు ఆరోపణలున్నాయి. భద్రాచలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అధికార పార్టీ నాయకుల అండతో దేవాలయ భూముల్లో లే అవుట్లు వేసి విక్రయించాడు. అనుమతుల్లేకుండా కొండ కింది భాగాన్ని పేల్చి, ప్రభుత్వ భూమిలో 36 అడుగుల రోడ్డు నిర్మించినా రెవెన్యూ అధికారులు మౌనందాల్చారు. సర్వే నెంబరు 115లోని 23.15 ఎకరాల భూమి దేవాలయానికి చెందినదని అనకాపల్లి జిల్లా దేవాదాయశాఖాధికారి 2022 జూన్ 15న దేవరాపల్లి తహశీల్దార్‌కు లేఖ రాశారు. ఇవేమీ పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారి 23.15 ఎకరాల దేవాలయ భూమిని ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్, జి బ్లాకులుగా విభజించి 30 అడుగుల గ్రావెల్ రోడ్డు వేశాడు. వ్యవసాయేతర భూమి కింద పన్ను కట్టకుండా ఎగ్గొట్టేందుకు లే అవుట్‌ను అగ్రిఫాం కింద చూపించాడు. లే అవుట్‌ను వ్యవసాయ భూమిగా చూపించేందుకు శ్రీగంధం మొక్కలు, జామ మొక్కలు వేశాడు.


ప్రజాశక్తి
శనివారం 23 జూలై 2022
కొండను తవ్వేస్తున్నారు


ప్రజాశక్తి
ఆదివారం 24 జూలై 2022
దేవాదాయ శాఖ మొద్దు నిద్ర
ఆక్రమణకు ఆమోద ముద్ర

ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనాలు

దేవాదాయ భూమిలో వేసిన లే అవుట్‌ను క్షేత్రస్థాయిలో అడ్డుకొనే ప్రయత్నం దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖాధికారులెవరూ చేయలేదు. దేవాదాయ భూమిలో లే అవుట్ వేసిన విషయం సిపిఎం ఫిర్యాదుతో వెలుగు చూసింది. 115 సర్వే నెంబర్‌లోని 23.15 ఎకరాల దేవాలయ భూమిని స్వాధీనం చేసుకోవాలని దేవాదాయ శాఖాధికారులు, రెవెన్యూ అధికారులకు నాడు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 115లోని 23.15 ఎకరాల దేవాలయ భూమిలో లే అవుట్ వేయడంపై 2022 జులై 23న ప్రజాశక్తి 'కొండను తవ్వేస్తున్నారు' శీర్షికన, 2022 జులై 24న 'దేవాదాయ శాఖ మొద్దునిద్ర, ఆక్రమణకు ఆమోద ముద్ర' శీర్షికన కథనాలు ఇచ్చింది. దీంతో దేవాదాయ శాఖలో కదలిక వచ్చింది. రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి వేసిన లే అవుట్ దేవాదాయ భూమి అని గుర్తించింది. ఆ భూములు రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిత జాబితాలో చేర్చింది. మారేపల్లి సర్వే నెంబర్ 115, 118/4, 120లో 40.25 ఎకరాల భూమిని 22ఎ(1)సిలో చేర్చుతూ దేవాదాయ శాఖ కమిషనర్ సెప్టెంబరు 15న జారీ చేసిన ఉత్తర్వుల కాపీ దేవాదాయ శాఖ విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్‌కు, అనకాపల్లి జిల్లా దేవాదాయశాఖాధికారికి పంపారు. సర్వే నెంబర్ 115, 118/4, 120లో 40.25 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చుతూ దేవాదాయశాఖ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులు అందాయని కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి

దేవరాపల్లి మండలం, మారేపల్లి సర్వే నెంబర్ 115, 118/4, 120లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చుతూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయం. సర్వే నెంబర్ 115లోని 23.15 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు దేవాదాయ శాఖ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదుచేశాం. నిషేధిత జాబితాలోని ఇప్పటికే జరిగిన భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. ఆక్రమణలకు గురైన దేవాదాయ శాఖ భూమిని స్వాధీనం చేసుకోవాలి. దేవాదాయ భూమిలో లే అవుట్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

డి.వెంకన్న, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ముగిసిన డిఆర్ఎం స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన నాలుగో డిఆర్ఎం కప్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు విశాఖపట్నంలోని రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ముగిశాయి. డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మంజు శ్రీ ప్రసాద్ సమక్షంలో విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో 180 మందికిపైగా పాల్గొన్నారు. చివరిరోజున 20 ఈవెంట్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఎకె మహారాణా, సీనియర్ డిఎస్‌టిఇ దీప్తాంశు శర్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.అవినాష్, జనరల్ సెక్రటరీ రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొరటాల చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అజశర్మ, గంగారావు, కొరటాల కుటుంబీకులు

గొప్ప మానవతావాది..కొరటాల

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గొప్ప మానవతావాది, అధ్యయన శీలి కొరటాల సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కొరటాల సత్యనారాయణ శత జయంతి సభ విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జరిగింది. తొలుత కొరటాల చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు విఎస్.పద్మనాభరాజు, కొరటాల కుమారుడు రాధాకృష్ణ, మనవడు విష్ణు వర్ధన్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో అజశర్మ మాట్లాడుతూ కొరటాల అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారని, తాను విశాఖ నగర కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆయనతో పనిచేసే అవకాశం దక్కిందని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం నాడు జరిగిన ఉద్యమంలో కొరటాల తన పదవిని మిగతా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులతో కలిసి తృణప్రాయంగా వదిలేసి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. కమ్యూనిజమే నిజమైన సిద్ధాంతమని నమ్మి కష్టజీవులకు అండగా తన యావజ్జీవితం నిలిచారన్నారు. ఆర్థిక క్రమశిక్షణగల నాయకుడని కొనియాడారు. విశాఖలో పంచ గ్రామాల భూ సమస్యపై నాడు ఏర్పాటైన కమిటీలో ద్రోణంరాజు సత్యనారాయణ, ఎం.సత్యనారాయణలతో కలిసి ఉన్నారన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు విఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ రైతాంగ, వ్యవసాయ సమస్యల అధ్యయనంలో కొరటాలది అందెవేసిన చేయి అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక వ్యవస్థాపక ఛైర్మన్‌గా కొరటాల పనిచేస్తూనే తన తుదిశ్వాస వరకూ విప్లవోద్యమంలో కృషిని కొనసాగించారన్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ కొరటాల జీవితం చాలా విలక్షణమైనదన్నారు. హైస్కూలు దశలోనే విద్యార్థులను ఏకం చేసి సమస్యలపై పోరాడిన యోధుడన్నారు.

కొరటాల ఆశయాలతో ముందుకెళ్లడం అభినందనీయం

కొరటాల సత్యనారాయణ కుమారుడు రాధాకృష్ణ మాట్లాడుతూ నాన్నగారి ఆశయాలతో నేటి తరం నాయకులంతా ముందుకెళ్లడం తనకెంతో ఆనందాన్నిస్తోందని అన్నారు. కొరటాల మనవడు విష్ణువర్ధన్ మాట్లాడుతూ తాతగారు ఆఖరి క్షణాల్లో తనతో పలు పుస్తకాలు చదివించుకోవడం తనకెంతో ఆనందకరమైన విషయమని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, రాజు పాల్గొన్నారు. పార్టీ సీనియర్ సభ్యులు సిఎన్.బాబు కొరటాలతో అనుబంధాన్ని వేదికపై వివరించారు.

విశాఖపట్నం : ఆటోనగర్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో కొరటాల చిత్రపటానికి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాశక్తి అభివృద్ధిలో కొరటాల కీలకపాత్ర పోషించారన్నారు. ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

'సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్'కు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వినూత్న బోధన, స్వదేశీ పరిశోధన పద్ధతిన 22 ఏళ్లుగా నడుస్తున్న సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో రుషికొండ గీతం పక్కన 'సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్' పేరిట ఛారిటబుల్ పాప్ అప్ ఈవెంట్‌ను నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. ఈ స్టోర్ల నుంచి నిరుపేదలు తమకు కావాల్సిన వస్తువులను తీసుకెళ్లారు. ఆ వస్తువులను తీసుకెళ్లేటప్పుడు వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.